www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 158 | హైదరాబాద్ | మంగళవారం | 26-08-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## తెలంగాణలోనే కాదు.. దేశమంతా యూరియా కొరత

**హైదరాబాద్ ఆగస్టు 25 (సిద్దిపేట పవర్):**

తెలంగాణలోనే కాదు.. దేశమంతా యూరియా కొరత ఉందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. యూరియా కొరత పట్ల రైతులు ఆందోళనలు చేయడం, చెప్పులు క్యూలైన్‌లో పెట్టడంపై విపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న నేపథ్యంలో మంత్రి స్పందిస్తూ రైతాంగానికి బహిరంగ లేఖ రాశారు. యూరియా కొరతకు కారణాలేంటో లేఖలో వివరించారు.

"రాష్ట్రంలో యూరియా కొరతకు రెండు ప్రధాన కారణాలున్నాయి. మొదటిది రాష్ట్రానికి దిగుమతి ద్వారా కేటాయించిన యూరియా ప్రపంచ వ్యాప్తంగా జియో పాలిటిక్స్ నేపథ్యంలో ఎర్ర సముద్రంలో నౌకాయానం నిలిచిపోయింది. ఆగస్టు వరకు రాష్ట్రానికి దిగుమతి ద్వారా 3.94 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్రం కేటాయించింది. కానీ, నౌకాయానం నిలిచిపోవడంతో సమయానికి రాలేదు. రెండో కారణం.. దేశీయంగా యూరియా ఉత్పత్తి డిమాండ్‌కు తగ్గస్థాయిలో లేకపోవడం. రామగుండం ఫ్యాక్టరీ నుంచి 1,69,325 మెట్రిక్ టన్నులు కేటాయించారు. కానీ, ఆ ఫ్యాక్టరీ 1,06,853 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసింది. 62,473 మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఏర్పడింది.




రామగుండం నుంచి అత్యధిక కేటాయింపులు జరపాలని కేంద్రాన్ని కోరినా ఆ ఫ్యాక్టరీ ఉత్పత్తిలో కేవలం 40 శాతమే రాష్ట్రానికి కేటాయించింది. అయితే, మే నుంచి ఈనెల వరకు 78 రోజులు ఆ ఫ్యాక్టరీలో ఉత్పత్తి జరగలేదు. రాష్ట్రానికి రావాల్సిన యూరియా సమయానికి రాలేదు. యూరియా దిగుమతి లేదు.. దేశీయంగా సరఫరా లేదు.. దీంతో కొరత ఏర్పడింది. రైతులకు వాస్తవాలు తెలియాలనే ఈ లేఖ రాస్తున్నా"అని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

# ఫీజుల పెంపా? కుదింపా?

## ఇంజనీరింగ్ ఫీజులపై నేటి నుంచి కసరత్తు

- ఎఫ్ఆర్సీ ముందుకు ప్రైవేటు కాలేజీలు
- కొత్త మార్గదర్శకాల ప్రకారం పరిశీలన
- జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులపై దృష్టి
- ఎఫ్ఆర్సీ ఆడిటర్లను మార్చే యోచన
- మరోవైపు ప్రైవేటు కాలేజీల అంతర్మథనం
- వచ్చేవారం సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చ!




**హైదరాబాద్ ఆగస్టు 25 (సిద్దిపేట పవర్):**

ఇంజనీరింగ్ ఫీజుల పెంపు అంశాన్ని రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (ఎఫ్ఆర్సీ) సోమవారం నుంచి తిరిగి పరిశీలించనుంది. అన్ని డాక్యుమెంట్లతో హాజరవ్వాలని ఇప్పటికే 180 కాలేజీలకు నోటీసులు పంపింది. తొలి రోజు 20 కాలేజీలతో చర్చించేందుకు షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ ప్రక్రియ వచ్చే నెల 3వ తేదీ వర కు కొనసాగుతుంది. 2025-28 బ్లాక్ పీరియడ్‌కు ఇంజనీరింగ్ కాలేజీల్లో వివిధ కోర్సులకు ఫీజులను ఖరారు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఆరు నెలల క్రితమే మొదలైంది.

కాలేజీల డాక్యుమెంట్లు, ఆడిట్ రిపోర్టులను కమిటీ పరిశీలించింది. కాలేజీలతో చర్చించి ప్రతిపాదిత ఫీజులతో నివేదికను ప్రభుత్వానికి పంపింది. ప్రభుత్వం అందుకు అంగీకరించకుండా ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ప్రత్యేక

..మిగతా 3లో

## ప్రధాని జైలుకెళ్లినా.. రాజీనామా చేయాల్సిందే

- ప్రధాని, సీఎంలు 30 రోజులు జైల్లో ఉంటే పదవి కోల్పోతారని వెల్లడి
- ఈ నిబంధన మోదీకి కూడా వర్తిస్తుందని స్పష్టీకరణ
- జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపడం ప్రజాస్వామ్యానికి అవమానమన్న హోంమంత్రి
- ఇది రాజకీయ కుట్రేనంటూ ప్రతిపక్షాల తీవ్ర నిరసన



2

## 'కేసీఆర్‌ను కడియం శ్రీహరి బ్లాక్ మెయిల్ చేశారు

- కూతురి ఎంపీ చేయడం కోసమే కడియం పార్టీ మారారని రాజయ్య ఆరోపణ
- కడియం ఒక అవినీతి తిమింగలమంటూ ఘాటు వ్యాఖ్యలు
- విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు పోస్టులు అమ్ముకున్నారని విమర్శ
- విదేశాల్లో ఆస్తులు, బినామీ లావాదేవీలు ఉన్నాయని ఆరోపణలు
- స్పీకర్ వెంటనే కడియం అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్



2

## ఉస్మానియా వర్సిటీని ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో అభివృద్ధి చేస్తా



- ఓయూను కాలగర్భంలో కలపాలని చూశారు..
- తెలంగాణ పదానికి ప్రత్యామ్నాయం ఉస్మానియా యూనివర్సిటీ
- తెలంగాణ, ఉస్మానియా రెండూ అవిభక్త కవలల్లాంటివి
- 1938 సాయుధ రైతాంగ పోరాటానికి ఊపిరిలూదిన గడ్డ ఇది
- డ్రగ్స్, గంజాయి కల్చర్ వేగంగా విస్తరిస్తోంది
- ఓయూకు మళ్లీ వస్తా.. ఈసారి ఒక్క పోలీస్ ఉండొద్దు
- మరో 15 రోజుల్లో ఎమ్మెల్సీగా కోదండరాంను పంపుతాం



**హైదరాబాద్ ఆగస్టు 25 (సిద్దిపేట పవర్):**

తెలంగాణ, ఉస్మానియా యూనివర్సిటీలు అవిభక్త కవలలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇవాళ ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో పలు అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. రూ.90 కోట్లతో నిర్మించిన హాస్టల్ భవనాలను సీఎం ప్రారంభించారు. అనంతరం డిజిటల్ లైబ్రరీతో పాటు రీడింగ్ రూమ్‌ను ఓపెన్ చేశారు. అదేవిధంగా దుందుభి, భీమా వసతి భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, ఓయూ వైస్ ఛాన్సలర్ వీసీ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉస్మానియా వర్సిటీలో పర్యటించాలంటూ వీసీ ఆహ్వానించారని, అభివృద్ధి కార్యక్రమాలను

..మిగతా 2లో

## స్వదేశీ ఉద్యమానికి యువతే నాయకత్వం వహించాలి

- అహ్మదాబాద్‌లో సర్దార్‌ధామ్ బాలికల హాస్టల్‌కు వీడియో సందేశం ద్వారా శంకుస్థాపన
- స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రజలకు, యువతకు ప్రధాని మోదీ పిలుపు
- 'ఇక్కడ స్వదేశీ వస్తువులే అమ్ముతాం' అని బోర్డులు పెట్టాలని దుకాణదారులకు సూచన
- మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ప్రధాని మోదీ
- నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తున్నామని వెల్లడి



2

## అనంతగిరి రిసార్ట్స్ కి కొత్త రూపు..

### మంత్రి జూపల్లి ప్రత్యేక ప్లాన్ ఏంటి..?

- అనంతగిరి హరిత రిసార్ట్స్ ను పైలట్ ప్రాజెక్ట్‌గా కలెక్టర్‌కి బాధ్యత
- ప్రైవేట్ రిసార్ట్స్ కు ఏమాత్రం తీసిపోని ఆధునిక సౌకర్యాలు
- ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ ఆదాయ వనరులు పెరుగుదలపై నమ్మకం
- పర్వత సౌందర్యం పర్యాటకులను ఆకర్షిస్తుందన్న మంత్రి విశ్వాసం



2

## రేవంత్ రెడ్డితో విభేదాలు ఉన్న మాట నిజమే..

- 25 మంది ఎమ్మెల్యేలతో రాజగోపాల్ రెడ్డి సీక్రెట్ మీటింగ్ అంటూ ప్రచారం
- ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పిన కోమటిరెడ్డి
- పార్టీలో చీలిక తెచ్చే ఉద్దేశం లేదని వ్యాఖ్య



2

## బండి సంజయ్ దొంగ ఓట్లతో గెలిచాడు.. బీఆర్ఎస్ మూడు ముక్కలైంది

- తెలంగాణలోని 8 మంది బీజేపీ ఎంపీలపైనా అనుమానం ఉందన్న మహేశ్
- దొంగ ఓట్లతోనే మోదీ అధికారంలోకి వచ్చారంటూ విమర్శ
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 100 సీట్లు ఖాయమని ధీమా



2

## విద్యార్థిపై లాఠీ పడితే..

### తెలంగాణ సమాజం ఊరుకోదు

- పోలీసు బలం, బలగంతో విద్యార్థుల నిరసన జ్వాలలను చల్లార్చలేరు
- ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల అరెస్ట్ అప్రజాస్వామికం
- అరెస్ట్ చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్



3

### ఉస్మానియా వర్సిటీని ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో

# అభివృద్ధి చేస్తా

మొదటిపేజీ తరువాయి

ప్రారంభించాలని కోరారని తెలిపారు. ఉస్మానియా వర్సిటీ అనే పదం తెలంగాణకు ప్రత్యామ్నాయ పదమని అన్నారు. నిజాం నవాబును పొగుడుతూ పాడటం కాదు.. దేశ స్వాతంత్ర్యం కోసం ఓయూ గడ్డపై నిలబడి వందేమాతరం పాడిన పీవీ నరసింహా రావు నేడు తనకు గుర్తొస్తున్నారని తెలిపారు. సాయుధ పోరాటంలో భాగంగా మారుమూల పల్లెల్లో ఎర్రజెండా పట్టుకుని పోరాటం చేసిన ఎందరో మహాభావులు ఉస్మానియా యూనివర్సిటీ అండగా నిలబడిందని అన్నారు. జాతీయ స్థాయిలో హోంమంత్రిగా పనిచేసిన శివరాజ్ పాటిల్‌తో మొదలు పెడితే.. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన పీవీ నరసింహా రావు లాంటి మహనీయులు చదివిన వర్సిటీ.. ఉస్మానియా వర్సిటీ అని కొనియాడారు.

**ఉస్మానియాను కాలగర్భంలో కలపాలని చూశారు..**

తెలంగాణ తొలితరం మర్రి చెన్నారెడ్డి, మల్లికార్జున్ గౌడ్, మదన్మోహన్ లాంటి వాళ్లు కూడా ఓయూ విద్యార్థులేనని అన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఘనత సాధించిన మాజీ కేంద్ర మంత్రి సూదిని జైపాల్ రెడ్డి కూడా ఓయూ బిడ్డేనని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉస్మానియా యూనివర్సిటీ పాత్ర చరిత్ర మరువదని అన్నారు. నేటికీ తెలంగాణలో ఏ సమస్య వచ్చినా.. ఉద్యమానికి పురిటి గడ్డ ఉస్మానియా యూనివర్సిటీయేనని పేర్కొన్నారు. చదువుతో పాటు పోరాటాన్ని నేర్పింది వర్సిటీయేనని.. తెలంగాణ సాధన యాదయ్య, శ్రీకాంతా చారి, వేణుగోపాల్ రెడ్డి కోసం అమరుడయ్యాడని గుర్తుచేశారు. అలాంటి చైతన్యాన్ని రగిల్చిన ఉస్మానియాను కొందరు కాలగర్భంలో కలిపాలని చూశారని ఆరోపించారు. 108 ఏళ్ల యూనివర్సిటీకి ఓ దళితుడిని వీసీగా చేసి చూపించామని అన్నారు. ఇక్కడే చదువుకున్న వారికి విద్యారంగంలో కీలక పదవులు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

**డ్రగ్స్, గంజాయి కల్చర్ వేగంగా విస్తరిస్తోంది..**

నేడు దేశానికి యువ నాయకత్వం అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమస్యల చర్చే కాదు.. సైద్ధాంతిక అంశాలకు కూడా వేదిక కావాలన్నారు. సామాజిక, సాంకేతిక అంశాలపై డిస్కషన్ జరగాలని అన్నారు. మనలో అసహనం పెరిగిందని, అశాంతి ఎక్కువైందని కామెంట్ చేశారు. చర్చించే వారిపై అణిచివేత ఎక్కువ కాలం నిలబడదని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో పరిణామాలు మానసిక వేదనకు గురిచేస్తున్నాయని తెలిపారు. కాలేజీల్లో కూడా విద్యార్థులు గంజాయికి అలవాటు పడుతున్నారని అన్నారు. డ్రగ్స్, గంజాయి కల్చర్ వేగంగా విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల్లో చైతన్యవంతమైన చర్యలు లేకపోవడం వల్లే అసాంఘిక కార్యక్రమాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. పేదలకు పంచేందుకు భూములు లేవని.. పేదల తలరాతలను మార్చేందుకు ప్రభుత్వం ఇవ్వగలిగింది నాణ్యమైన విద్య అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**ఓయూకు మళ్లీ వస్తా..**

**ఈసారి ఒక్క పోలీస్ ఉండొద్దు**

తాను కూడా పేదరికం నుంచి ఈ స్థాయికి వచ్చానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులు వారిని నష్టం చేసిన వాళ్లను నిర్ద్వందంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మన బడ్జెట్ రూ.లక్ష కోట్లు కాళేశ్వరం రూపంలో గంగలో కలిశాయని అన్నారు. కానీ, తమ ప్రభుత్వం రూ.25 వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా యంగ్ ఇండియా స్కూళ్లను నిర్మిస్తోందని తెలిపారు. తాను మళ్లీ ఉస్మానియా యూనివర్సిటీ తప్పకుండా వస్తానని.. డిసెంబర్‌లో ఆర్ట్స్ కాలేజీ ముందు మీటింగ్ పెడతానని అన్నారు. క్యాంపస్ పరిధిలో ఒక్క పోలీస్ కూడా ఉండొద్దని.. ఎవరి అభిప్రాయం వాళ్లు చెప్పొచ్చని అన్నారు. అప్పుడు విద్యార్థులు నిరసన తెలిపినా తాను ఏమీ అనబోనని తెలిపారు. విద్యార్థులు లేవనెత్తిన సమస్యలపై అదేరోజు అక్కడికక్కడే ఓయూ అభివృద్ధి పనులకు జీవోలు ఇస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

**మరో 15 రోజుల్లో ఎమ్మెల్సీగా కోదండరాంను పంపుతాం**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో ఏనుగులు సింహాలు ఉన్నాయంటూ ఏఐ టెక్నాలజీతో వీడియో క్రియేట్ చేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కానీ ఏనుగులు, మానవ మృగాలు ఫామ్‌హౌస్‌లో ఉన్నాయని.. ముందు వాటిని బంధించాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీ పదవిపై ఢిల్లీ వరకు వెళ్లి కుట్రలు చేశారని.. మరో 15 రోజుల్లోగా ఎమ్మెల్సీగా కోదండరామ్‌ను పంపిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఓయూకు రూ.వెయ్యి కోట్లు మంజూరు చేస్తానని.. ఇంజినీర్స్ కమిటీ వేయాలంటూ యోగితారాణాను సీఎం ఆదేశించారు.




### రేవంత్ రెడ్డితో విభేదాలు

# ఉన్న మాట నిజమే..

- 25 మంది ఎమ్మెల్యేలతో రాజగోపాల్ రెడ్డి సీక్రెట్ మీటింగ్ అంటూ ప్రచారం
- ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పిన కోమటిరెడ్డి
- పార్టీలో చీలిక తెచ్చే ఉద్దేశం లేదని వ్యాఖ్య

**హైదరాబాద్ ఆగస్టు 25 (సిద్దిపేట పవర్):**

తాను 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రహస్యంగా సమావేశమయ్యానంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ వార్తలను ఆయన పూర్తిగా ఖండించారు. కొంతమంది ఎమ్మెల్యేలు తనను మామూలుగానే కలిశారని, దానిని ఒక సమావేశంగా చిత్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన వివరణ ఇచ్చారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు కొన్ని విషయాల్లో అభిప్రాయ భేదాలు ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ, పార్టీలో చీలిక తీసుకువచ్చే ఆలోచన తనకు లేదని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీకి నష్టం కలిగించే పనులు తాను చేయబోనని ఆయన అన్నారు. ఇటీవల కాలంలో రేవంత్ రెడ్డి పనితీరుపై రాజగోపాల్ రెడ్డి బహిరంగంగానే కొన్ని విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన రహస్య భేటీ నిర్వహించారనే వార్తలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపాయి.

మరోవైపు, బీజేపీ నేత ఈటల రాజేందర్‌తో కలిసి రాజగోపాల్ రెడ్డి కొత్త పార్టీ పెట్టబోతున్నారనే ఊహాగానాలు కూడా మీడియాలో బలంగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యేలతో సమావేశం వార్త బయటకు రావడంతో ఆ ఊహాగానాలకు మరింత బలం చేకూరినట్టయింది. అయితే, రాజగోపాల్ రెడ్డి స్వయంగా ఈ ప్రచారాన్ని కొట్టిపారేయడంతో ప్రస్తుతానికి ఈ చర్చకు తెరపడినట్లయింది. అయినప్పటికీ, అధికార పార్టీలో ఒక సీనియర్ ఎమ్మెల్యేపై ఇలాంటి వార్తలు రావడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేపుతోంది.



# ప్రధాని జైలుకెళ్లినా.. రాజీనామా చేయాల్సిందే

- ప్రధాని, సీఎంలు 30 రోజులు జైల్లో ఉంటే పదవి కోల్పోతారని వెల్లడి
- ఈ నిబంధన మోదీకి కూడా వర్తిస్తుందని స్పష్టీకరణ
- జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపడం ప్రజాస్వామ్యానికి అవమానమన్న హోంమంత్రి
- ఇది రాజకీయ కుట్రేనంటూ ప్రతిపక్షాల తీవ్ర నిరసన

**నేషనల్‌బ్యూరో ఆగస్టు 25 (సిద్దిపేట పవర్):**

జైలుకు వెళ్లిన మంత్రుల పదవుల తొలగింపునకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుపై వస్తున్న విమర్శలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా గట్టిగా తిప్పికొట్టారు. ఈ బిల్లు ప్రకారం, ప్రధాని నరేంద్ర మోదీ జైలుకు వెళ్లినా తన పదవిని కోల్పోవాల్సి ఉంటుందని, ఆయన తనకు తాను ఈ నిబంధనను వర్తింపజేసుకున్నారని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో పస లేదని ఆయన కొట్టిపారేశారు.

గతవారం కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టింది. వీటిలో ఒకటైన రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు, 2025 ప్రకారం.. కనీసం ఐదేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉన్న కేసులో ప్రధాని, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు అరెస్టయి 30 రోజుల పాటు కస్టడీలో ఉంటే, 31వ రోజున వారు ఆటోమేటిక్‌గా తమ పదవులను కోల్పోతారు. అయితే, ఇది బీజేపీయేతర ప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్ర అని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడిన అమిత్ షా, ప్రతిపక్షాల తీరుపై మండిపడ్డారు. "ఒక ముఖ్యమంత్రి గానీ, ప్రధాని గానీ జైలు నుంచి దేశాన్ని పాలించడం సాధ్యమేనా? ఇది మన ప్రజాస్వామ్య గౌరవానికి తగినదేనా? జైలునే సీఎం హౌస్, పీఎం హౌస్‌గా మార్చేసి.. అక్కడి నుంచే డీజీపీ, చీఫ్ సెక్రటరీలకు ఆదేశాలిస్తారా? ఒక వ్యక్తి లేకపోతే దేశ పాలన ఆగిపోతుందన్న వాదనను నా పార్టీ, నేను పూర్తిగా తిరస్కరిస్తున్నాం" అని ఆయన అన్నారు.

గతంలో ఇందిరా గాంధీ తన పదవిని కాపాడుకోవడానికి 39వ రాజ్యాంగ సవరణ తెచ్చారని, కానీ ప్రధాని మోదీ మాత్రం తనకు కూడా వర్తించేలా చట్టం తీసుకొచ్చారని అమిత్ షా గుర్తుచేశారు. ఈ బిల్లు వల్ల పార్లమెంటులో గానీ, అసెంబ్లీలో గానీ ఎవరి మెజారిటీకి నష్టం వాటిల్లదని స్పష్టం చేశారు.

"ఒక సభ్యుడు జైలుకు వెళ్తే, పార్టీకి చెందిన మరో సభ్యుడు ప్రభుత్వాన్ని నడుపుతారు. బెయిల్ వచ్చాక మళ్లీ ప్రమాణ స్వీకారం చేయొచ్చు. దీనికి అభ్యంతరం ఎందుకు?" అని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనీయకుండా ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించడం సరికాదని, దీనిపై ఉభయ సభల సంయుక్త కమిటీలో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.





## కేసీఆర్ ను కడియం శ్రీహరి బ్లాక్ మెయిల్ చేశారు

- కూతురి ఎంపీ చేయడం కోసమే కడియం పార్టీ మారారని రాజయ్య ఆరోపణ
- కడియం ఒక అవినీతి తిమింగలమంటూ ఘాటు వ్యాఖ్యలు
- విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు పోస్టులు అమ్ముకున్నారని విమర్శ
- విదేశాల్లో ఆస్తులు, బినామీ లావాదేవీలు ఉన్నాయని ఆరోపణలు
- స్పీకర్ వెంటనే కడియం అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్

**హైదరాబాద్ ఆగస్టు 25 (సిద్దిపేట పవర్):**

ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఒక అవినీతి తిమింగలమని, ఆయన ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో కూడా చెప్పలేని అయోమయ స్థితిలో ఉన్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తాటికొండ రాజయ్య ఎద్దేవా చేశారు. కేవలం తన కుమార్తెకు ఎంపీ టికెట్ ఇప్పించుకోవడం కోసమే శ్రీహరి పార్టీ మారారని, తన రాజకీయ సమాధిని తానే నిర్మించుకున్నారని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో చేరానని స్వయంగా ప్రకటించిన కడియం శ్రీహరి, ఇప్పుడు అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. "పదిహేనేళ్ల పాటు మంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు గుర్తుకురాని అభివృద్ధి, ఇప్పుడు కొత్తగా గుర్తుకువచ్చిందా?" అని రాజయ్య నిలదీశారు. స్టేషన్ ఘన్‌పూర్‌ను అభివృద్ధి చేయడం పక్కనపెట్టి, కడియం శ్రీహరి మాత్రమే అభివృద్ధి చెందారని ఆరోపించారు.

శ్రీహరి విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఉద్యోగాలను అమ్ముకున్నారని, కాంట్రాక్టర్ల నుంచి పెద్దఎత్తున డబ్బులు వసూలు చేశారని విమర్శించారు. అంతేకాకుండా, విదేశాల్లో ఆస్తులు కూడబెట్టారని, హైడల్ ప్రాజెక్టులను అమ్ముకున్నారని, బినామీ పేర్లతో ఆయనకు భారీగా ఆస్తులున్నాయని ఆరోపించారు. టికెట్ ఇవ్వకపోతే పార్టీ మారుతానంటూ కేసీఆర్‌ను సైతం కడియం బ్లాక్‌మెయిల్ చేశారని రాజయ్య వ్యాఖ్యానించారు.

ఫిరాయింపుల విషయంలో స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలని రాజయ్య డిమాండ్ చేశారు. "జస్టిస్ బీఆర్ గవాయ్ మూడు నెలల గడువు ఇచ్చారు. స్పీకర్ రాజ్యాంగాన్ని గౌరవించి, అంబేద్కర్ మీద గౌరవం ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లు వింటే స్పీకర్ కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లే అవుతుంది" అని హెచ్చరించారు. కడియం శ్రీహరికి ప్రజలు కచ్చితంగా కర్రుకాల్చి వాత పెడతారని రాజయ్య జోస్యం చెప్పారు.



# అనంతగిరి రిసార్ట్స్‌కి కొత్త రూపు..

## మంత్రి జూపల్లి ప్రత్యేక ప్లాన్ ఏంటి.?

- అనంతగిరి హరిత రిసార్ట్స్ ను పైలట్ ప్రాజెక్ట్‌గా కలెక్టర్‌కి బాధ్యత
- ప్రైవేట్ రిసార్ట్స్ కు ఏమాత్రం తీసిపోని ఆధునిక సౌకర్యాలు
- ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ ఆదాయ వనరులు పెరుగుదలపై నమ్మకం
- అనంతగిరి పర్వత సౌందర్యం పర్యాటకులను ఆకర్షిస్తుందన్న మంత్రి విశ్వాసం

**హైదరాబాద్ ఆగస్టు 25 (సిద్దిపేట పవర్):**

వికారాబాద్ జిల్లా అనంతగిరి పర్యాటక అభివృద్ధి దిశగా పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పలు చర్యలు చేపట్టారు. వికారాబాద్ కేంద్రంలో ఆయన అనంతగిరి హరిత రిసార్ట్స్, అనంతగిరి వ్యూ టవర్ ప్రాంతాలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, హరిత రిసార్ట్స్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పర్యవేక్షణలో అప్పగించినట్లు తెలిపారు. ప్రైవేట్ రిసార్ట్స్ అందించే సౌకర్యాలకు ఏమాత్రం తీసిపోకుండా ఆధునిక సదుపాయాలతో హరిత రిసార్ట్స్‌ను అభివృద్ధి చేయాలని ఆయన స్పష్టం చేశారు.

ఈ ప్రాజెక్టు ద్వారా వికారాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి, ప్రభుత్వానికి ఆదాయ వనరులు విస్తరించి, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడతాయని మంత్రి నమ్మకం వ్యక్తం చేశారు. కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకుని అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వికారాబాద్ పర్యాటక దృష్టిలో ప్రత్యేకత కలిగిన ప్రదేశమని, అనంతగిరి పర్వతాల అందాలు, హరిత రిసార్ట్స్ సదుపాయాలు, వ్యూ టవర్ ఆకర్షణలు మరింత మంది సందర్శకులను ఆకట్టుకుంటాయని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

## స్వదేశీ ఉద్యమానికి యువతే నాయకత్వం వహించాలి

- అహ్మదాబాద్‌లో సర్దార్‌ధామ్ బాలికల హాస్టల్‌కు వీడియో సందేశం ద్వారా శంకుస్థాపన
- స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రజలకు, యువతకు ప్రధాని మోదీ పిలుపు
- 'ఇక్కడ స్వదేశీ వస్తువులే అమ్ముతాం' అని బోర్డులు పెట్టాలని దుకాణదారులకు సూచన
- మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ప్రధాని మోదీ
- నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తున్నామని వెల్లడి

**అహ్మదాబాద్ ఆగస్టు 25 (సిద్దిపేట పవర్):**



దేశ స్వావలంబనకు స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడమే కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇది వందేళ్ల నాటి పాత నినాదం కాదని, దేశ భవిష్యత్తును బలోపేతం చేసే ఆధునిక ప్రచారమని ఆయన స్పష్టం చేశారు. ఈ నూతన స్వదేశీ ఉద్యమానికి సమాజం, ముఖ్యంగా యువత నాయకత్వం వహించాలని ఆయన పిలుపునిచ్చారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సర్దార్‌ధామ్ ఫేజ్ 2 కన్యా ఛాత్రాలయ (బాలికల వసతి గృహం) శంకుస్థాపన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆదివారం ఆయన వీడియో సందేశం ద్వారా ప్రసంగించారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, ప్రతి దుకాణదారుడు తమ వద్ద "కేవలం స్వదేశీ ఉత్పత్తులు మాత్రమే అమ్ముతాం" అనే బోర్డును ప్రదర్శించాలని సూచించారు. కుటుంబాలు కూడా దేశీయంగా తయారైన వస్తువులనే కొనుగోలు చేయాలని కోరారు. మంచి ఉద్దేశంతో పవిత్రమైన లక్ష్యంతో సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తే దైవబలం కూడా తోడవుతుందని ఆయన పేర్కొన్నారు.

మహిళా సాధికారత దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని నొక్కిచెప్పారు. కొత్తగా నిర్మిస్తున్న ఈ హాస్టల్‌లో 3,000 మంది బాలికలకు వసతి కల్పించనున్నామని, ఇది వారిని ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా చేస్తుందని తెలిపారు. వడోదర, సూరత్, రాజ్‌కోట్, మెహసానా వంటి నగరాల్లోనూ ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు బాలికా విద్య కోసం ప్రారంభించిన 'కన్యా శిక్షా రథ యాత్ర' వంటి కార్యక్రమాలు ఇప్పుడు 'బేటీ బచావో, బేటీ పఢావో' రూపంలో దేశవ్యాప్త ఉద్యమంగా మారాయని గుర్తుచేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఆర్థిక అవకాశాలు కల్పించేందుకు 'లఖ్‌పతి దీదీలు', 'డ్రోన్ దీదీ', 'బ్యాంక్ సఖి' వంటి పథకాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని మోదీ తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం ద్వారా నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రపంచవ్యాప్తంగా భారత నైపుణ్య మానవ వనరులకు డిమాండ్ పెరుగుతోందని అన్నారు.

సౌరశక్తి, రక్షణ, డ్రోన్ పరిశ్రమలతో పాటు స్టార్టప్‌ల రంగంలో దేశం రికార్డు స్థాయిలో పురోగమిస్తోందని చెప్పారు. ఉపాధి అవకాశాలను పెంచే లక్ష్యంతోనే ఈ నెలలో రూ.1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

### బండి సంజయ్ దొంగ ఓట్లతో గెలిచాడు..

# బీఆర్ఎస్ మూడు ముక్కలైంది

- తెలంగాణలోని 8 మంది బీజేపీ ఎంపీలపైనా అనుమానం ఉందన్న మహేశ్ గౌడ్
- దొంగ ఓట్లతోనే మోదీ అధికారంలోకి వచ్చారంటూ విమర్శ
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 100 సీట్లు ఖాయమని ధీమా

**హైదరాబాద్ ఆగస్టు 25 (సిద్దిపేట పవర్):**

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు గుప్పించారు. కరీంనగర్‌లో బండి సంజయ్ విజయం దొంగ ఓట్లతోనే సాధ్యమైందని, తెలంగాణలోని మిగతా బీజేపీ ఎంపీల గెలుపుపైనా తమకు అనుమానాలున్నాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. కరీంనగర్ జిల్లాలో చేపట్టిన జనహిత యాత్రలో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ మాట్లాడుతూ, "కరీంనగర్‌లో బండి సంజయ్ గెలుపు దొంగ ఓట్ల వల్లే జరిగింది. రాష్ట్రంలోని మిగతా 8 మంది బీజేపీ ఎంపీలు కూడా ఇలాగే గెలిచారేమోనని అనుమానంగా ఉంది" అని అన్నారు. బీసీల సమస్యలను పక్కనపెట్టి బండి సంజయ్ ఢిల్లీకి పరిమితమయ్యారని, రాష్ట్ర సమస్యలపై స్పందించడం లేదని విమర్శించారు. ప్రధాని మోదీ సైతం ప్రజల మద్దతుతో కాకుండా దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చారని ఆయన ఆరోపించారు.

ఇదే సమయంలో బీఆర్ఎస్ పార్టీపైనా ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ ఇప్పటికే మూడు ముక్కలైందని, త్వరలోనే నాలుగో ముక్క కూడా బయటకు వస్తుందని జోస్యం చెప్పారు. తెలంగాణలో ఇక కాంగ్రెస్ పార్టీకి తప్ప మరే పార్టీకి భవిష్యత్తు లేదని, వచ్చే ఎన్నికల్లో వందకు తగ్గకుండా సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని, వారి భవిష్యత్తుకు భరోసా ఇచ్చేందుకే ఈ జనహిత యాత్ర చేపట్టామని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేయలేకపోయిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే ఇళ్లను సిద్ధం చేసి చూపిస్తోందని తెలిపారు. కులం, మతం పేరుతో ఓట్లు అడగటం బీజేపీకి అలవాటు అని, కాంగ్రెస్ పార్టీ మాత్రం అభివృద్ధి, సంక్షేమ అజెండాతోనే ప్రజల ముందుకు వెళ్తుందని ఆయన అన్నారు.



# విద్యార్థిపై లాఠీ పడితే.. తెలంగాణ సమాజం ఊరుకోదు



- పోలీసు బలం, బలగంతో విద్యార్థుల నిరసన జ్వాలలను చల్లార్చలేరు
- ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల అరెస్ట్ అప్రజాస్వామికం
- అరెస్ట్ చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్

**హైదరాబాద్ ఆగస్టు 25 (సిద్దిపేట పవర్):**

సీఎం రేవంత్ ఉస్మానియా యూనివర్సిటీ పర్యటన నేపథ్యంలో విద్యార్థులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజంపై నిషేధాజ్ఞలు విధిస్తారా అని ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నదని చెప్పారు కేసీఆర్ హయాంలో ఓయూలో శంకుస్థాపన చేసిన నిర్మాణాలను ప్రారంభించడం తప్ప 22 నెలలుగా రేవంత్ రెడ్డి చేసిందేముందన్నారు. జాబ్‌క్యాలెండర్‌ను జాబ్ లెస్ క్యాలెండర్ చేశారని మండిపడ్డారు. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీకి వస్తున్న సందర్భంగా విద్యార్థులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామిక, పిరికిపంద చర్య. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఒక్క విద్యార్థి మీద పోలీసు లాఠీ పడినా తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరిస్తున్నాం. ఇందుకేనా విద్యాశాఖను, హోం శాఖను మీ వద్ద పెట్టుకున్నది. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నది. మొత్తం తెలంగాణ సమాజం మీద నిషేధాజ్ఞలు విధిస్తారా?. ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్య పాలన అని చెప్పి, ఎమర్జెన్సీ రోజులను తిరిగి తెచ్చిండు రేవంత్ రెడ్డి. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇవ్వడం. కేసీఆర్ హయాంలో ఓయూలో శంకుస్థాపన చేసిన నిర్మాణాలను ప్రారంభించడం తప్ప 22 నెలలుగా నువ్వు చేసింది ఏముంది రేవంత్ రెడ్డి?. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ చేసారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలని మోసం చేసారు. నిరుద్యోగ భృతి పేరిట నయవంచన చేసారు. 22నెలల్లో 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నావు. నీ తప్పుడు ప్రచారంపై కడుపు మండిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నవు. నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటే నువ్వు ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీస్తున్నవు. గ్రంథాలయాల్లో పోలీసు లాఠీ చార్జీలు జరిపించిన అరాచక చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది. విద్యార్థులు, నిరుద్యోగుల వీపులు పగుల గొట్టిన అమానుష పాలన కాంగ్రెస్ ప్రభుత్వానిది. ఆంక్షలతో, నిషేధాలతో నిరుద్యోగుల హృదయాల్లో రగులుతున్న నిరసన జ్వాలలను చల్లార్చలేరు. ఇనుప కంచెలు, బ్యారికేడ్లతో ప్రజా తిరుగుబాటును ఆపలేరు. పోలీసు బలం, బలగంతో విద్యార్థుల నిరసన జ్వాలలను చల్లార్చలేరు. ఉస్మానియా విద్యార్థి, నిరుద్యోగులు సింహాలై గర్జిస్తరు. ఉద్యోగాల పేరిట మీరు చేసిన మోసాన్ని ఎక్కడికక్కడ నిలదీస్తరు. మోసం చేసినందుకు ఉస్మానియా సాక్షిగా విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.' అని హరీశ్ రావు అన్నారు.

# గజ్వేల్ మండల ఆటో ట్రాలీ డ్రైవర్ల సమావేశం

**సిద్దిపేట పవర్ గజ్వాల్ నియోజకవర్గం**: గజ్వేల్ మండల ఆటో డ్రైవర్లు శ్రీ రేణుక ఎల్లమ్మ మినీ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ ఆదివారం మక్తమాసన్ పల్లిలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్స్ మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుండి ట్రాలీ ఆటోలు వచ్చి మాకు పోటీగా తక్కువ రేటుతో మొక్కజొన్న, పశు గ్రాసం ట్రాలీ ఆటోలలో తరలించి మాకు జీవనోపాధి లేకుండా చేస్తున్నారని, ప్రభుత్వం మా యందు దయ తలచి గజ్వేల్ లోకల్ ఆటో ట్రాలీలకు భంగం వాటిల్లకుండా ఇతర ప్రాంతాల నుండి వచ్చే ఆటో ట్రాలీలను ఇక్కడ నడపకుండా చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు లేని ఎడల త్వరలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మునీర్ పాషా, ఉపాధ్యక్షులు కేశవమైన సాయి కిరణ్, జనరల్ సెక్రెటరీ స్వామి గౌడ్, జాయింట్ సెక్రెటరీ, ఆలం సబ్, కోశాధికారి కొంతం శ్రీకాంత్, వంజరి రాజు సభ్యులు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.





# మండల్ జయంతిని సామాజిక న్యాయసాధన దినంగా పాటిద్దాం

**సామాజిక ఉద్యమ నాయకులు పోచబోయిన శ్రీహరి యాదవ్ పిలుపు**

**సిద్దిపేట, ఆగస్టు 25:** మండల్ జయంతిని సామాజిక న్యాయసాధన దినంగా పాటిద్దామని జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్, సామాజిక ఉద్యమ నాయకులు పోచబోయిన శ్రీహరి యాదవ్ పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో జరిగిన బ్రిందేశ్వర్ ప్రసాద్ మండల్ 107వ జయంతిని వివిధ బీసీ కుల సంఘాల ప్రజాసంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచబోయిన శ్రీహరి యాదవ్ మాట్లాడుతూ బీపీ మండల్ 107 వ జయంతిని సామాజిక న్యాయ సాధనా దినంగా బీసీ రిజర్వేషన్ల పోరాటాలని మరింత ఉధృతం చేయడం కోసం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నేడు గతంలోలా జాతీయ పార్టీలు బిసి రిజర్వేషన్లు నిరంతరం వాయిదా వేయాలని చూస్తున్నాయి. కానీ నేటి బీసీల చైతన్యం ఇంకా ఎక్కువ కాలం వాయిదా వేసేలా లేవన్నారు. రోజురోజుకు తీవ్రమవుతున్న బీసీ రిజర్వేషన్ సాధన ఉద్యమానికి బీపీ మండల్ కృషిని త్యాగాలని వారి జయంతి సందర్భంగా మననం చేసుకుంటూ బీసీ కమిషన్ 40 సిఫారసులను అమలు చేసే విధంగా ఐకమత్యంగా ఉద్యమించాలని పోచబోయిన శ్రీహరి యాదవ్ పిలుపునిచ్చారు. బ్రిందేశ్వర ప్రసాద్ మండల్ 1918లో నూట ఏడేళ్ల క్రితం జన్మించి భారత రాజ్యాంగంలోని 340 ఆర్టికల్ ప్రకారం ఏర్పాటుచేసిన రాజ్యాంగబద్ధ రెండో బిసి కమిషన్కు చైర్మన్ గా వారు బీసీల సామాజిక విద్యాపర వెనుకబాటుపై లోతైన విశ్లేషణ చేసి సంపూర్ణ సామాజిక సమానత్వం కోసం ఓబిసిల అభ్యున్నతి కోసం 40 రికమండేషన్ ను చేశారని వాటిని యధాతథంగా అమలు చేసినట్లయితే ఈ దేశంలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలలో పూర్తిస్థాయి సామాజిక మార్పు వచ్చి సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కాబట్టి మండల కమిషన్ సిఫారసులను అమలు చేసేలా ఐక్య ఉద్యమాల నిర్మించాలని, బిపి మండల్ కి భారతరత్న ఇవ్వాలని ఈ సందర్భంగా నాయకులందరూ ముక్తకంఠంతో నినదించారు. ఈ కార్యక్రమంలో మామిండ్ల ఐలయ్య యాదవ్, కోరే ఎల్లయ్య కురుమ, ఒగ్గు బాల మల్లు కురుమ, ఇరుకోడు సత్తన్న గౌడు, ఆకుల శివకుమార్, యాద నరేందర్ కొత్వాల్, బోయ రాములు, పయ్యావుల ఎల్లం, కాటుక నరసింహులు, పాతుకుల వెంకటేశం, కాముని నగేష్, చింతల మల్లేష్ అడ్వకేట్, ఉడుత రవి, మామిళ్ల రాము యాదవ్, పయ్యావుల రాములు యాదవ్, బొల్లు రాము,, పయ్యావుల శ్యాము యాదవ్, అప్పల యాదగిరి , బీన బోయిన కృష్ణ,, చింతల కుమార్, చౌదరి సంపత్ తదితరులు పాల్గొన్నారు



# ఫీజుల పెంపా?కుదింపా?




**మొదటిపేజీ తరువాయి**

కమిటీని వే సింది. ఈ కమిటీ సూచనల మేరకు కాలేజీల ఫీజుల వ్యవహారాన్ని మరోసారి ఎఫ్ఆర్సీ విచారిస్తోంది.

**ప్రైవేటు కాలేజీలకు టెన్షన్**

కాలేజీల్లో నాణ్యత ప్రమాణాలను కొత్తగా మార్గదర్శకాలుగా తీసుకుంటున్నారు. ఇందుకు జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులు ఉన్న కాలేజీలను గుర్తించాల్సి ఉంటుంది. దీనిపై కాలేజీ యాజమాన్యాల్లో గుబులు మొదలైంది. కొన్ని కాలేజీలకు జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులు ఉన్నా గతంలో ఎప్పుడూ ఫీజుల పెంపునకు వీటిని కొలమానంగా తీసుకోలేదు. ఈ ర్యాంకులు లేకున్నా, తక్కువ స్థాయిలో ఉన్నా నిర్ణీత ఫీజుకు కత్తెర కూడా వేసే అవకాశం ఉందని యాజమాన్యాలు భయపడుతున్నాయి. కొన్ని కాలేజీలు న్యాక్ ర్యాంకు కోసం కూడా ప్రయత్నించలేదు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు టాప్ కాలేజీలకు మాత్రమే వస్తున్నాయని యాజమాన్యాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలో పెద్ద కాలేజీలకే న్యాయం జరుగుతుందని, చిన్న కాలేజీలు నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

**ఆడిట్ లెక్కలపై సందేహాలు**

గత మూడేళ్ల జమా ఖర్చులను కాలేజీలు ఎఫ్ఆర్సీకి ఇప్పటికే సమర్పించాయి. వీటిని ఆడిట్ విభాగాలు పరిశీలించాయి. అయితే, కాలేజీల్లో ఆడిట్ చేసినవారితో ఎఫ్ఆర్సీ ఆడిటర్లకు సంబంధాలున్నాయని, ఇప్పుడు వారిని మార్చే అవకాశం ఉందని చెబుతున్నారు. మౌలిక వసతులకు చేసిన ఖర్చు, ఫ్యాకల్టీకి చెల్లించిన వేతనాలు డిజిటల్ విధానంలో చూపించా లని ఎఫ్ఆర్సీ కోరే అవకాశం ఉంది.

అయితే దాదా పు 85 కాలేజీల వద్ద ఇలాంటి ఆధారాలు లేవని సమాచారం. దీంతో ఈ కాలేజీల ఫీజుల్లో కోత పడుతుందా? అనే సందేహాలు యాజమాన్యాల్లో కలుగుతున్నాయి. ప్లేస్‌మెంట్లను కూడా ఫీజుల పెంపునకు కొల మానంగా తీసుకోబోతున్నారని తెలిసింది.

అయితే, కొన్నేళ్లుగా కం పెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించడం లేదు. ఆఫ్ క్యాంపస్ నియామకాలే జరుగుతున్నాయి. పెద్ద కాలేజీల్లో విద్యార్థులు క్యాంపస్ ఉద్యోగాలకు ప్రయత్నించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని ఎంతవరకు పరిగణనలోనికి తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

**భవిష్యత్ కార్యాచరణపై కాలేజీల కసరత్తు**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎఫ్ఆర్సీ ముందు హాజరైనా.. భవిష్యత్ కార్యాచరణపై ఉమ్మడిగా ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు భావిస్తున్నాయి. షెడ్యూల్ ప్ర కారం మొదటి వారం రోజులు ఎఫ్ఆర్సీ ముందు హాజరయ్యే వాటిల్లో ఒక మోస్తరు కాలేజీలున్నాయి.

వీటి పట్ల కమిటీ ఎలా వ్యవహరిస్తుంది? ఏయే అంశాలను పరిగణనలోనికి తీసుకుంటుంది? ఫీజులు పెంచుతారా? తగ్గిస్తారా? అనే అంశాలను పరిశీలించాలని నిర్ణయించాయి. దీని ఆధారంగా వచ్చేవారం సమావేశమై చర్చించాలని నిర్ణయించినట్టు ఓ కాలేజీ ప్రతినిధి తెలిపారు. అవసరమైతే న్యాయ పోరాటం చేయడమా? ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమా? ఏదీ కాకపోతే సమ్మెకు వెళ్లడమా? అనే అంశాలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.



# నానో యూరియాతో అధిక ప్రయోజనాలు

- నానో యూరియా, డ్రోన్ సేవలపై అవగాహన
- స్ప్రే విధానాన్ని పరిశీలించిన ఏవో ప్రవీణ్ కుమార్

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు 25 ప్రతినిధి** ఒక బస్తా సామర్థ్యం గల యూరియా కి బదులు నానో యూరియా వాడటంతో రైతులు అధిక లాభాలు, ప్రయోజనం పొందవచ్చని దుబ్బాక మండల వ్యవసాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం ఏవో ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పద్మనాభుని పల్లి గ్రామంలో నానో యూరియా పై అవగాహన, డ్రోన్ సేవల వినియోగం పై దుబ్బాక ఎఫ్పీవో రైతులకు, ఫార్టిలైజర్ డీలర్లకు అవగాహన చేశారు. అనంతరం రైతుల పొలాల్లో స్ప్రే చేస్తున్న విధానాన్ని దుబ్బాక ఎఫ్పీవో చైర్మన్ కుకునూరి యాదయ్య, డైరెక్టర్ లింగం, ఏ ఈవో లు, ఫార్టిలైజర్ డీలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ యూరియా కొరతని అధిగమించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నానో యూరియాని అందుబాటులోకి తీసుకొచ్చాయన్నారు. ఒక ఎకరం పొలానికి 500 ఎం ఎల్ నానో బాటిల్ ని స్ప్రే చేయాలనీ సూచించారు. 8 నుంచి 10 రోజుల వ్యవధిలో నానో పనితీరు కనిపిస్తుందన్నారు. ఇఫ్కో ద్వారా దుబ్బాక ఎఫ్పీవో కి సబ్సిడీ ద్వారా వచ్చిన డ్రోన్ తో రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం ఉందన్నారు. నానో యూరియా మొక్కలకు కావాల్సినంత యూరియాని తీసుకుని గాలి కాలుష్యం కాకుండా చూస్తుందన్నారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే నానో యూరియాని వాడి అధిక లాభాలు పొందాలని ఏవో సూచించారు. కేవలం రూ. 500లకే నానో యూరియాతో ఎకరం పొలానికి స్ప్రే చేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని దుబ్బాక మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తదనంతరం దుబ్బాక ఎఫ్పీవో చైర్మన్ కుకునూరి యాదయ్య, డైరెక్టర్ లింగం మాట్లాడుతూ నానో యూరియా వాటడం వల్ల రైతులకు మేలు జరుగుతుంది. గతంలో నానో యూరియాపై పెద్దగా తెలియకపోవడంతో దాని పని తీరు మాకు అర్థమయ్యేది కాదు దుబ్బాక ఎఫ్ పీ వో ఆధ్వర్యంలో ఇఫ్కో ద్వారా అవగాహన చేయడంతో ప్రస్తుత కాలంలో యూరియా కొరత కారణంగా వ్యవసాయధికారులు అందించిన సలహాలు, సూచనలతో రెండు ఎకరాల్లో నానో యూరియా స్ప్రే చేయించాను. 8 నుంచి 10 రోజుల్లో ఈ నానో యూరియా పని తీరు కనిపించింది. సొసైటీలో ఉన్న డ్రోన్ యొక్క సేవలు వినియోగించుకుంటూ ఇతర రైతులకు నానో యూరియా పని తీరుపై ప్రచారం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, సొసైటీ సభ్యులు ఏపీవోలు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ..!


**సందీప్ రెడ్డి జన్మదినం సందర్భంగా పేద పిల్లలకు అన్నదానం**

**చేర్యాల, ఆగస్టు 24 (సిద్దిపేట పవర్)** చేర్యాల ప్రాంతానికి సుపరిచితులు, సమాజ సేవకులు చేతిరెడ్డి సందీప్ రెడ్డి జన్మదినం సందర్భంగా 25 పేద కుటుంబాలకు అన్నదానం చేశాడు..ఈ సందర్భంగా సందీప్ రెడ్డి మాట్లాడుతూ నా జన్మదినాని పరసురించుకొని చేసిన ఈ అనదానం ఎంతో ఆనందాన్ని నీ ఇచ్చింది అని , ఆ పిల్లల నవ్వులు చూస్తుంటే ఆత్మ సంతృప్తి కలిగింది అని తెలిపారు.. మీ జన్మదినాలకు, పెళ్ళి రోజులకు ఇలాంటి పేద పిల్లలకు ఎంతో సాయం చేయాలని సందీప్ రెడ్డి విజ్ఞప్తి చేశారు..కార్యక్రమంలో తాండ్ర అనజనేయులు, తాండ్ర సాగర్, బంగారీగల్ల కిరణ్, గోనెపల్లి మహేష్, మీనుగు హరీష్ తదితరులు పాలొనారు..












# దౌలాపూర్ గ్రామానికి నూతన బస్సు సర్వీస్

- యాదగిరి గుట్ట డిపో మేనేజర్ మురళి కృష్ణ కి కృతజ్ఞతలు
- జిల్లా యూత్ కాంగ్రెస్ విభాగం నాయకులు చిలుకూరి మహేందర్ రెడ్డి

**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం :** యాదగిరిగుట్ట నుండి కొండారెడ్డి చెరువు వరకు వచ్చే బస్సును దౌలాపూర్ మీదుగా జగదేవపూర్ వరకు పొడిగించినందుకు గుట్ట డిపో మేనేజర్ మురళీకృష్ణకి దౌలాపూర్ గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు. గత సోమవారం గ్రామానికి చెందిన దూస గాంధీ అలియాస్ వెంకటేష్ చిలుకూరి మహేందర్ రెడ్డి కేశమైన మహేందర్ యాదవ్ కుకునూరి కృష్ణ హనుమండ్ల మనోహర్ యాదగిరిగుట్ట డిపో మేనేజర్ కి వినతి పత్రం అందజేశారు. మేనేజర్ వెంటనే స్పందించిన ఆయన వారంలోపే దౌలాపూర్ గ్రామానికి బస్సు సర్వీస్ ని ఏర్పాటు చేశారు. అలాగే కృతజ్ఞతగా గ్రామస్తులు సోమవారం డ్రైవర్, కండక్టర్లను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామస్తులు మొదటి రోజు బస్సులో ప్రయాణం సాగించారు.ఈ కార్యక్రమంలో ఇటిక్యాల సుధాకర్ రెడ్డి, చిలుకూరి మహేందర్ రెడ్డి, కేశమైన మహేందర్ యాదవ్, చిలుకూరి మధుసూదన్ రెడ్డి, కుకునూరి కృష్ణ, ఈరమైన మైసయ్య, బొల్లు మహేష్, ఇప్పలగూడెం నరేందర్ రెడ్డి మర్రికింది శేశికళ, మాస్కురి ఎల్లం కేశపురం బాలకనకయ్య గందమల్ల బాలయ్య ఆకారం శ్రీను, పెద్ద నరసింహులు, తదితరులు ఉన్నారు.




# అభివృద్ధి వెనుకంజలో రామక్కపేట

**ఎల్లమ్మ కట్ట రోడ్డులో వెలగని వీధిలైట్లు -**

**దుబ్బాక, సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు 25 ప్రతినిధి** దుబ్బాక మండల పరిధిలోని రామక్కపేట గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు వెనుకంజలో ఉన్నాయని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా గ్రామంలోని ఎల్లమ్మ కట్ట రోడ్డులో, చీకోడ్ రోడ్డులో, ఎస్సీ కాలనీ సీసీ రోడ్డులో, వీధిలైట్లు వెలగకపోవడం వల్ల రాత్రి వేళల్లో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో చీకటి కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పండుగల సీజన్ అయిన దసరా వస్తున్న నేపథ్యంలో, వీధిలైట్లు లేకపోవడం పండుగ వాతావరణానికి కూడా ఆటంకం కలిగిస్తోంది. వీధిలైట్ల సమస్యపై గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. "పండుగ సమయంలో లైట్లు వేస్తామని చెప్పడం సరికాదు, వెంటనే చర్యలు తీసుకోవాలి" అని వారు కోరారు. అందరికీ వెలుతురు అందించేందుకు వీలుగా ఎల్లమ్మ కట్ట రోడ్డులో, పలు చోట్ల వీధిలైట్లు వెంటనే ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు విజ్ఞప్తిచేస్తున్నారు.



# కాంగ్రెస్ నేత తుమ్మ రామయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

**అంతిమయాత్రలో పాడేమోసిన నర్సారెడ్డి**

**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం :** సీనియర్ కాంగ్రెస్ నేత, తుమ్మ రామయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ మండలం దాచారంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుమారులు తుమ్మ కనకయ్య, తుమ్మ శ్రీనివాస్ లను ఓదార్చడంతో పాటు పార్టీ అభివృద్ధికి రామయ్య అందించిన సేవలను గుర్తు చేశారు. వారి కుటుంబం కాంగ్రెస్ పట్ల అంకితభావంతో ఉందని, ఎంతో నిబద్ధత కలిగిన వారు ఇప్పటికీ పార్టీ కోసం కష్టపడుతున్నట్లు స్పష్టం చేశారు. అలాగే రామయ్య అంతిమయాత్రలో నర్సారెడ్డి పాల్గొని పాడే మోయగా, ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొనగారి రాజు, మండల పార్టీ బాధ్యుడు సుఖేందర్ రెడ్డి, నాయకులు రామచంద్ర రెడ్డి, చిన్నా రెడ్డి, గోపాల్ రెడ్డి, బూరుగుపల్లి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో ఏ అధికారి అయిన భవన నిర్మాణ కార్మికుల దగ్గర డబ్బులు వసూలు చేసినచో కఠిన చర్యలు తీసుకోవాలి

**సిద్దిపేట పవర్:**

సిద్దిపేట జిల్లాలో ఇటీవల ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారుల ఇళ్ళు నిర్మిస్తున్న కార్మికుల నుండి ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్. చేస్తూ ప్రజావాణిలో కలెక్టర్కు భవన నిర్మాణ కార్మిక రంగాల సంఘాల రాష్ట్ర కార్యదర్శి తోట్ల పరిసరాములు కార్మికులలతో కలిసి ప్రజావాణిలో కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు . ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణంలో లాభాపేక్ష లేకుండా మేము (మేస్త్రీ) భవన నిర్మాణ రంగ కార్మికులము సహకరించదలిచాము. ఈ జిల్లాలో మీరు చేపడుతున్న పథకం క్రింద మా మేస్త్రీలను, ప్రభుత్వ అధికారులు డబ్బులు డిమాండ్ చేయకుండా కట్టడి చేయవలసినదిగా మనవి. జి ల్లాఏ అధికారి అయిన మా కార్మికుల దగ్గర డబ్బులు వసూలు చేసినచో కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు . బి ఎస్ ఆర్ కే ఎస్ రాష్ట్ర కార్యదర్శి తోట్ల పరుశరాములు ఆకుల ప్రశాంత్ గంగాపురం రాజు బి మల్లేశం ఎర్రం రమేష్ జంగిటి శ్రీనివాస్ తన్నీరు నర్సింలు తదితరులు పాల్గొన్నారు



## పండుగను సంబురంగా, శాంతియుతంగా జరుపుకోవాలి.

- **నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్**
- **గణేష్ వేడుకలు–2025 ఏర్పాట్లపై శాంతి కమిటీతో సమన్వయ సమావేశం**

**సికింద్రాబాద్, ఆగస్ట్ 25 ( సిద్దిపేట పవర్) :**

రాబోయే గణేష్ ఉత్సవం-2025 ను ప్రజలు సంబరంగా, శాంతియుతంగా జరుపుకోవాలని, వేడుకలు సాఫీగా నిర్వహణకు పోలీస్ అధికారులతో సహకరించాలని నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ కోరారు. సోమవారం ఉత్తర మండల డీసీపీ కార్యాలయంలో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అదనపు డీసీపీ , గోపాలపురం, మహంకాళి,బేగంపేట,తిరుమల్ గిరి డివిజన్ల ఏసీపీలు, ఉత్తర మండలంలోని ఎస్హెచ్ఓలు, కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్లతో పాటు 70 మందికి పైగా శాంతికమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఉత్సవాల విస్తృతి, ప్రాధాన్యత దృష్ట్యా, గత అనుభవాలను సమీక్షిస్తూ, ప్రజా భద్రత, సాఫీగా ఉత్సవాలు, శాంతియుత నిమజ్జన ప్రదర్శనల కోసం సమగ్ర ఏర్పాట్లను ఖరారు చేశారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పర్యావరణ హిత మట్టి విగ్రహాల ఏర్పాటుకు ప్రోత్సహించాలన్నారు. అన్ని గణేశ్ మండపాలు ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. మండపాల్లో స్వచ్ఛంద కార్మికుల వివరాలు, గుర్తింపు పత్రాలు, బ్యాక్ గ్రౌండ్ దృవీకరణ, అగ్నిమాపక, విద్యుత్ భద్రత చర్యలు, మండపాల వద్ద పేలుడు పదార్థాలు, జ్వలించే పదార్థాల వాడకంపై నిషేదం, రోడ్ల అక్రమణలు, ప్రజాప్రదేశాల్లో విగ్రహాల ఏర్పాటు చేయకూడదు అనే అంశాలపై పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి, తనిఖీలు చేయాలన్నారు. విగ్రహాల పరిమితులు, ట్రాఫిక్ మళ్ళింపులు,చిన్న, చిన్న చెరువుల్లో సురక్షిత నిమజ్జనంపై అవగాహన కల్పించాలన్నారు. 24 గంటల పాటు స్వచ్ఛంద కార్మికుల డ్యూటీ, సీసీ కెమెరాలు, ఫైర్ ఎక్స్టింగ్విషర్ల ఏర్పాటు, పరిశుభ్రత పాటించడంపై దృష్టి పెట్టాలన్నారు.

## తనకు సైన్స్ పాఠాలు చెప్పిన టీచర్ కు ఎమ్మెల్యే సన్మానం

**తమ శిష్యుడు ఎమ్మెల్యేగా రావడంతో టీచర్ హ్యాపీ**



**సికింద్రాబాద్, ఆగస్ట్ 25 ( సిద్దిపేట పవర్ ):** తనకు టెన్త్ లో సైన్స్ పాఠాలు చెప్పిన టీచర్ సడెన్ గా కనిపించడంతో సంతోషం చెందిన ఎమ్మెల్యే ఆమెను సత్కరించి, ఆశీర్వాదం తీసుకున్నారు. వివరాలు ఇవి..కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ సోమవారం ఉదయం మోండా డివిజన్ రెజిమెంటల్ బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను విజిట్ చేశారు. స్కూల్ సమస్యలను తెలుసుకోడానికి వెళ్ళిన ఎమ్మెల్యేకు అక్కడ తనకు పదవతరగతిలో పాఠాలు బోధించిన సైన్స్ టీచర్ నిర్మల మేడం కనిపించారు. నిర్మల టీచర్ అదే పాఠశాలలో పనిచేస్తున్నట్లు తెలుసుకొని, అక్కడే మేడం కు సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. తన శిష్యుడు ఎమ్మెల్యేగా కనిపించడంతో టీచర్ సంతోషం చెందారు. దాంతో పాఠశాలలోని ఆమె సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## గణేశ్ ఏర్పాట్లు, జాగ్రత్తలపై చిలకలగూడ ఏసీపీ సమీక్షా

**సికింద్రాబాద్, ఆగస్ట్ 25 ( సిద్దిపేట పవర్):**

రాబోవు గణేశ్ నవరాత్రోత్సవాల సందర్భంగా తీసుకొను జాగ్రత్తలు, నియమ నిబంధనాలు తదితర అంశాలపై చిలకలగూడ ఏసీపీ కె.శశాంక్రెడ్డి సోమవారం వారాసిగూడ పీఎస్ లోని ఏసీపీ కార్యాలయంలో అధికారులు,మండపాల నిర్వహకులతో కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనాలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. వినాయకుడి ఉత్సవాలను సంబురంగా జరుపుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు సృష్టించకూడదన్నారు. వినాయకుడి ప్రతిష్టాపన నుంచి నిమజ్జనం వరకు పోలీస్ అధికారులతో నిర్వాహకులు సహకరించాలన్నారు. సమావేశంలో చిలకలగూడ ఇన్ స్పెక్టర్ అనుదీప్, డీఐ రమేశ్ గౌడ్, ఇన్స్పెక్టర్లు రఘుబాబు,మధుసూదన్ రెడ్డి,పురేందర్ రెడ్డి,చిలకలగూడ డివిజన్ లోని ఎస్.ఐలు, ఏఈ రచిత,సునీల్,చంద్రశేఖర్ , మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.










# గ్రేటర్ వైశ్య బిజినెస్ లీడర్స్ సమావేశం

- **అంగరంగ వైభవంగా ప్రమాణస్వీకార మహోత్సవం**
- **102 మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం**
- **ఇంకా కొంతమంది సభ్యులకు ఆహ్వానం**
- **నియమ నిబంధనల ప్రకారం సభ్యుల చేరిక**






**సిద్దిపేట పవర్ , సిద్దిపేట బ్యూరో :**

సిద్దిపేట వి ఎస్ ఎస్ కన్వెన్షన్ లో ఆదివారం రోజున గ్రేటర్ వైశ్య బిజినెస్ లీడర్స్ సిద్ధి సిద్దిపేట చాప్టర్ ఛైర్మెన్ గా డా. మాంకాల నవీన్ కుమార్ వైస్ ఛైర్మెన్ ఆపరేషన్ గా గరిపల్లి లక్ష్మణ్ కుమార్ వైస్ ఛైర్మెన్ ఫైనాన్స్ గా తిప్పరాజు రంజిత్ కుమార్ లు జీవిబిఎల్ ఫౌండర్ మరియు సీఈఓ మంచి రాజశేఖర్ హైదరాబాద్ గారు ప్రమాణ స్వీకారం చేయించారు మిగతా సభ్యులు అందరినీ టైటాన్ కౌన్సిల్ అధ్యక్షులు జిల్లా ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు తదుపరి సిద్ధి చాప్టర్ ఛైర్మెన్ డా. మాంకాల నవీన్ కుమార్ అడ్వైసర్ లుగా దొంతుల బాలకిషన్ అయిత సత్యం లను వివిధ కార్యకలాపలా డైరెక్టర్లను అందులో భాగముగా ఆపరేషన్స్ కి చీకోటీ వంశీ కృష్ణ అయిత సంతోష్ వెన్యూ కి తోడుపూరి సంతోష్ కూర ఆత్మారాం, ఫైనాన్స్ కి మాంకాల సంతోష్ కుమార్ చకిలం వంశీ కుమార్ చాప్టర్ గ్రోత్ కి సోమ శివకుమార్ తొడుపునూరి రాజు లీడర్షిప్ మరియు రెఫరల్ కి యాంసాని సుధాకర్ రాజూరి నగేష్ మెంబర్షిప్ ఎదుగుదలకు బెజుగామ సాయికృష్ణ అయిత రామకృష్ణ ఈవెంట్స్ కి చింత సంకీర్త్ కొమరవెల్లి సాకేత్ గ్రీటింగ్స్ కి పుల్లూరి శ్రీనివాస్ చకిలం విజయ్ కుమార్ పబ్లిక్ రిలేషన్ కి గోపిశెట్టి బిక్షపతి తొడుపునూరి శ్రీనివాస్ డిజిటల్ ప్రమోషన్స్ మంచాల ఉదయ్ మంచాల సందీప్ లను ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈ సందర్భముగా జీవిబిఎల్ ఫౌండర్ మరియు సీఈఓ మంచి రాజశేఖర్ హైదరాబాద్ మాట్లాడుతూ జీవిబిఎల్ ద్వారా క్రమశిక్షణతో కూడిన వ్యాపార అభివృద్ధి జరుగుతుంది అని దీని ద్వారా కొంత మదికి ఉపాధి కూడా కలుగుతుంది సభ్యుల వ్యాపార అభివృద్ధి కొరకు కావలసిన శిక్షణ శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తాము అని సంస్థ యొక్క నియమ నిబంధనలు పాటిస్తూ ముందుకు పోవాలని చెప్పారు.

ఛైర్మెన్ వైస్ ఛైర్మన్లు డా మాంకాల నవీన్ కుమార్ వైస్ ఛైర్మన్లు తిప్పరాజు రంజిత్ కుమార్ గరిపల్లి లక్ష్మణ్ కుమార్ లు మాట్లాడుతూ ఈ కార్యక్రమం సభ్యుల ప్రోత్సాహంతో ఉత్సాహంగా నిర్వహించాం అని వీరితో పాటు డెకరేషన్ కి చింత సంకీర్త్ ఈవెంట్స్ కొమరవెల్లి సాకేత్, బోజనానికి బెజుగామ ప్రశాంత్ ఫోటో వీడియో లకు బుక్క శ్రీనివాస్ ఫ్లెక్సీ ప్రింట్స్ కి బుక్క సంతోష్ లు ఇతర మిత్రులు ప్రత్యేక సహకారం అందించారు ఈ సందర్భముగా అందరికీ వారు కృతజ్ఞతలు తెలియజేశారు

ఈ కార్యక్రమములో చాప్టర్ లాంచ్ అంబాసిండర్స్ అలుగూరి విజయ భాస్కర్ పల్లా శివకుమార్ టైటాన్ కౌన్సిల్ హైదరాబాద్ నుండి జిల్లా ప్రసాద్ చింత తరుణ్ క్రాంతి కుమార్ బి సంతోష్ కుమార్ నికీలు గుండా శ్రీనివాస్ గందేసిరి భారత్ కుమార్ కే. వేణుగోపాల్ ఆర్.ప్రసాద్ పి.కృష్ణ మోహన్, కపిల చాప్టర్ కరీంనగర్ నుండి ఎల్లంకి అనిల్ కుమార్ సాయి కృష్ణ పి సంతోష్ కుమార్, ప్రణవ చాప్టర్ హైదరాబాద్ నుండి టి శివ తేజ, డా.శాలిని రంజిత్ కుమార్ గార్లు అతిధులుగా హాజరు అయ్యి వారు మాట్లాడుతూ హృదయపూర్వక ఆనందం మరియు గౌరవంతో, సిద్ధి సిద్దిపేట హెడ్టేబుల్ మరియు మొత్తం బృందానికి చాప్టర్ ఇన్‌స్టాలేషన్ విజయంపై శుభాభినందనలు తెలియజేశారు. 102 మంది సభ్యుల విజయవంతమైన చేర్పు కేవలం ఒక మైలురాయి మాత్రమే కాదు—మీ విజన్, కృషి, ఐక్యత మరియు అంకితభావానికి ప్రతీక అని అత్యుత్తమమైన ఆతిథ్యం, సమయ పాలన, ఆహ్లాదకరమైన విందు మరియు శ్రద్ధగా నిర్వహించిన ఏర్పాట్లు ఈ కార్యక్రమానికి ప్రత్యేక గౌరవాన్ని తీసుకొచ్చాయి. సభ్యులలో ఉన్న ఆత్మీయత, క్రమశిక్షణ మరియు సమైక్యత ఈ వేడుకను మరింత ప్రేరణాత్మకంగా తీర్చిదిద్దాయి అని

ఇది ఇంకా ఎన్నో విజయాలకు, అభివృద్ధికి మార్గదారిగా నిలవాలని వారి భావాలను తెలియజేసి సభ్యులు అందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అందరూ కుటుంబ సమేతముగా పాల్గొని విజయవంతం చేశారు.



## వికలాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కట్కూరి యాదగిరి**

**నంగునూరు, ఆగస్టు 25 ( సిద్దిపేట పవర్ )**ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కట్కూరి యాదగిరి డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అలవి కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం నేడు వాటిని గాలికి వదిలి చేతకాని పాలనను సాగిస్తోందని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు ఆరెపల్లి రాజయ్య, దేవులపల్లి కనకయ్యలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల వేళలో వికలాంగులకు పెన్షన్ రూ.4 వేల రూ.6 వేలకు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారని ఆరోపించారు. వికలాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డి వికలాంగులకు ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో వికలాంగులతో కలిసి సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

## వ్యక్తిగత శుభ్రత తోనే ఆరోగ్యం

**డాక్టర్ ఉదయ్ కుమార్.**

**నంగునూరు ఆగస్టు 25 ( సిద్దిపేట పవర్)** నంగునూరు: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే ఆరోగ్యం లభిస్తుందని రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఉదయ్ కుమార్ అన్నారు. సోమవారం నంగునూరు మండలం పాలమాకుల షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ వసతి గృహాన్ని ఆయన సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు సీజనల్ గా డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వసతి గృహంలో పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించేలా దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వంటగదిని పరిశీలించి విద్యార్థులకు అందించే కూరగాయలను, పప్పులను పరిశీలించారు. ప్రతిరోజు విద్యార్థులకు తాజా కూరగాయలు అందేలా చూడాలన్నారు. ప్రస్తుత సీజన్ లో జ్వరాలు వస్తే వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు. డాక్టర్ వెంట హెచ్ ఈ ఓ స్వామి, వార్డెన్ గణేశ్, ఏఎన్ఎం పద్మ, హెల్త్ అసిస్టెంట్ మహేందర్ లు ఉన్నారు



## ఘనంగా బాబా రాందేవ్ అవతార్ వాలే జయంతి వేడుకలు.

**సిద్దిపేట మార్వాడి సేవాసమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు.**

**సిద్దిపేట పవర్** సకల మానవాళికి జీవన విధానం బోధిస్తూ మనుషుల మధ్య సోదర భావాన్ని బాబా రాందేవ్ అవతార్ వాలే పెంపొందించారని బాబా రాందేవ్ సేవా సమితి నాయకులు తెలిపారు. బాబా రాందేవ్ అవతార్ వాలే 674 వ జయంతిని సిద్దిపేట మార్వాడి సేవాసమితి నాయకులు ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలోని రాందేవ్ బాబా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ,అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడడంలో రాందేవ్ బాబా ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయన బోధనలను తూచా తప్పకుండా పాటిస్తూ ఆయన చూపిన మార్గంలో నడుస్తామని తెలిపారు. బాబా రాందేవ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మార్వాడి సేవా సమితి సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. బాబా రాందేవ్ అవతార్ వాలే ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో మంచాల,భికారం,లలిత్,పునారం తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..



## మట్టి వినాయకులను పూజించండి.. పర్యావరణాన్ని కాపాడండి.

**ఉచితంగా విగ్రహాల పంపిణీ కౌన్సిలర్ మల్లికార్జున్.**

**సిద్దిపేట పవర్:**సిద్దిపేట 16 వా వార్డు లోని ఇందిరమ్మ కాలనీ లో మరియు బొర్ర పెరుమాళ్ళ గుడి దగ్గర మట్టి వినాయకలు పంచడం జరిగింది ఈ కార్యక్రమం లో వార్డు ప్రజలు ఇందిరమ్మ కాలనీ హనుమాన్ గుడి కమిటీ సభ్యులు చంద్రం, కృష్ణగౌడ్, రాంబాబు, బొర్ర పెరుమాళ్ళ గుడి కమిటి సభ్యులు మార్క శ్రీను, సత్యం గౌడ్, అనిల్, శ్రీను పాల్గొనడం జరిగింది.





**రాష్ట్ర ఎస్సి ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అల్లుడు మృతి చెందగా చిన్నకోడూరు లో మృత దేహానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు.. మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసారు.. ఎదిగే వయస్సు కొడుకుని కోల్పోయిన తల్లి తండ్రులను, శోక సంద్రం లో ఉన్న కుటుంబాన్ని ఓదార్చారు.. అధైర్య పడొద్దని మనోధైర్యాన్ని ఇచ్చారు..**



# సకినాల పండగ సంక్రాంతి

తెలంగాణలో సంక్రాంతి అనగానే సకినాల పండగ అనడం అందరికీ తెలిసిందే. ఈ వారంలో సంక్రాంతి సందర్భంగా ప్రతి ఇంటి వాకిట్లో కంచుడు పెట్టి సకినాలు చేయాల్సిందే. సకినాలు అందరికీ చేయడం రాదు. ముఖ్యంగా దీనికి బియ్యాన్ని నానబెట్టి దాన్ని గిర్నిలో పట్టించి ఆ తర్వాత సకినాలు పోస్తారు. ఇదే కాకుండా గారెలు, మురుకులు, వివిధ రకాల పిండి వంటలు చేసుకోని.. కోడి కూర వండుకుని తినడం స్పెషల్.
అయితే కొందరు బియ్యప్పిండితో మురుకులు చేసుకోవాలనుకుంటారు. కరకరలాడుతూ ఎంతో టేస్టీగా ఉండే వీటిని పిల్లల నుంచి పెద్దల వరకు చాలా ఇష్టంగా తింటారు. కానీ, చాలా మందికి అవి అంత పర్ఫెక్ట్‌గా కుదరవు. అలాంటి వారు ఈ సంక్రాంతికి ఇలా ట్రై చేయండి. కరకరలాడుతూ టేస్టీగా, క్రిస్పీగా వస్తాయి! మరి, అందుకు కావాల్సిన పదార్థాలు తయారీ తెలుసుకుందాం
ఇందుకోసం ముందుగా బియ్యాన్ని శుభ్రంగా కడిగి అందులో నీళ్లు పోసి నాలుగైదు గంటల పాటు నానబెట్టుకోవాలి.
ఆ తర్వాత నీళ్లు వడకట్టి ఒక శుభ్రమైన క్లాత్ మీద పలుచగా పరచి కనీసం 15 నిమిషాల పాటు ఆరనివ్వాలి. నీరంతా పోయి కాస్త తడిగా ఉన్నప్పుడు గిర్నీకి తీసుకెళ్లి పిండి పట్టించి తెచ్చుకోవాలి.
ఆ తర్వాత పట్టించుకున్న పిండిని ఒక వెడల్పాటి ప్లేట్(బేషన్)లో జల్లించుకొని పక్కనుంచాలి.
అనంతరం స్టౌపై చిన్న కడాయి పెట్టుకొని నువ్వులను వేసి దోరగా వేయించుకోవాలి. ఆపై వాటిని జల్లించుకున్న పిండిలో వేసుకోవాలి. అలాగే వాము, తగినంత ఉప్పు వేసుకొని అన్నీ కలిసేలా ఒకసారి చక్కగా కలుపుకోవాలి. ఆ తర్వాత అందులో తగినన్ని వాటర్ యాడ్ చేసుకుంటూ మురుకుల పిండిలా తడిపి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఓ కాటన్ క్లాత్‌ను తడిపి పలుచగా పరచి కలిపి పెట్టుకున్న పిండిని కొంచెం కొంచెం చేత్తో తీసుకుని వేళ్లతో పొడవుగా తిప్పుతూ మూడు లేదా నాలుగు చుట్లుగా చుట్టాలి. ఆవిధంగా పిండి మొత్తాన్ని చేసుకోవాలి. తర్వాత వాటిని కాసేపు ఆరనివ్వాలి.
ఆలోపు స్టౌపై కడాయిలో నూనె పోసి వేడి చేసుకోవాలి. ఆయిల్ కాగిన తర్వాత సకినాలను వేసుకొని దోరగా కాలనిచ్చి తీసేయాలి.
చల్లారిన తర్వాత ఏదైనా డబ్బాలో వేసి స్టోర్ చేసుకుంటే చాలు. అంతే, ఎంతో టేస్టీగా ఉండే "తెలంగాణ స్పెషల్ సకినాలు రెడీ.
అయితే, ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయమేమిటంటే పిండిని చేతిలోకి తీసుకుని వేళ్లతో సన్నని తాడుగా వలయాకారంగా చేయడానికి నైపుణ్యం ఉండాలి.
కాబట్టి, ఒకవేళ మీకు అలా చేయడం రాకపోతే జంతికల గొట్టంలో స్టార్ గుర్తు ఉన్న బిళ్లను వేసి లోపల కొద్దిగా ఆయిల్ రాసి పిండి ముద్దను ఉంచి సకినాల షేప్‌లో ఒత్తుకున్నా సరిపోతుంది.



# పిల్లలకు తప్పక నేర్పించాల్సిన విషయాలేంటో తెలుసా

ప్రతి చిన్నారికి కూడా తొలి గురువులు తల్లిదండ్రులే. వారిని చూసే పిల్లలు చాలా విషయాలు నేర్చుకుంటారు. తొలి పలుకుల దగ్గర నుంచి తొలి అడుగుల వరకు తల్లిదండ్రుల ద్వారా నేర్చుకుంటారు. ఇలాంటి సమయాల్లోన్నే తల్లిదండ్రులు కూడా చాలా జాగ్రత్త వహించాలి. ప్రతి విషయాన్ని పిల్లలకు చాలా జాగ్రత్తగా నేర్పించుకోవాలి. చిన్నప్పుడు తల్లిదండ్రి నేర్పించే ప్రతి విషయం కూడా వారి వ్యక్తిగత ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయి. పిల్లలు ఉన్నతంగా ఆలోచించాలి అంటే ఇవి వారికి ఉపయోగపడతాయి. పిల్లల అభివృద్ధిలో పేరింగ్ చాలా కీలక పాత్ర పోషిస్తుంది. తల్లిదండ్రులు నేర్పించే అంశాలను బట్టే వారి నడవడిక ఉంటుంది. తల్లిదండ్రులందరూ తమ పిల్లలకు మంచి రోల్ మోడల్‌గా ఉండటం చాలా ముఖ్యం. ఎందుకంటే పిల్లలను చూసే తల్లిదండ్రులు చాలా విషయాలను నేర్చుకుంటారు. వారు పైకి ఉన్నతంగా ఎదగాలి అంటే తప్పకుండా మీరు సరైన విలువలు నేర్పించాలి. భవిష్యత్తులో మంచి వ్యక్తులుగా ఎదగాలని పిల్లలకు నేర్పించాలి. గొప్ప గొప్ప వ్యక్తుల జీవిత కథలను చిన్నప్పటి నుంచే వినిపించాలి. చిన్నారుల ముందు మంచిగా ప్రవర్తించాలి. తల్లిదండ్రులు తమ పిల్లల ముందు చేసే, చెప్పే లేదా ప్రవర్తించే వాటిని పిల్లలు మోడల్ చేస్తారు.
పిల్లలు పెద్దయ్యాక ఎలా ప్రవర్తిస్తారు. పిల్లలకు ప్రాథమిక జీవన నైపుణ్యాలను నేర్పడంలో తల్లులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నట్లే, బయట ప్రపంచంలో వారికి సహాయపడే పాఠాలను పిల్లలకు నేర్పించడంలో తండ్రి ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. తండ్రులు తమ పిల్లలకు కూడా కచ్చితంగా మంచి విషయాలను నేర్పించాలి.

**ఇతరులను గౌరవించండి**

తండ్రులు తమ పిల్లలకు నేర్పించవలసిన ముఖ్యమైన విషయాలలో ఒకటి ఇతరులను గౌరవించడం గురించి చెప్పాలి. తల్లిదండ్రులు ఇంట్లో ఒకరినొకరు గౌరవంగా చూసుకుంటే, పిల్లలు కూడా తమ చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరినీ గౌరవించడం ప్రారంభిస్తారు. వయస్సు లేదా ఇతర భేదాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ గౌరవించడం పిల్లలకు నేర్పించాలి.

**తప్పులను అంగీకరించడం**

తండ్రులు తమ పిల్లలకు తమ తప్పులను అంగీకరించమని ఎల్లప్పుడూ నేర్పించాలి. తండ్రి మొండిగా ఉండి తప్పులు ఒప్పుకోకుంటే పిల్లలకు కూడా ఇదే అలవాటు అవుతుంది. ఇంట్లో వాదనల సమయంలో కోపం చూపిస్తే పిల్లలు ఆ ప్రవర్తనను ఆదర్శంగా తీసుకుని, తమను తాము రక్షించుకునే అలవాటును పెంచుకుంటారు. పొరపాట్లను అంగీకరించడం వల్ల పిల్లలు జీవితంలో గొప్పవారు అవుతారని పిల్లలకు నేర్పించాలి.

**వైఫల్యానికి భయపడవద్దు**

వైఫల్యాన్ని తప్పుగా లేదా చెడుగా చూడకూడదని పిల్లలకు నేర్పించడం చాలా ముఖ్యం. అపజయం జీవితంలో ఒక భాగమని, అపజయమే విజయానికి మొదటి మెట్టు అని పిల్లలకు నేర్పించాలి. అపజయంలేని విజయం గర్వాన్ని ఇస్తుందని పిల్లలకు నేర్పించాలి.

**అనుభవాలు నేర్పే పాఠాల గురించి గొప్పగా చెప్పాలి.**

ఓడిపోవడం వల్ల నష్టమేమీ లేదని తండ్రులు తమ పిల్లలకు ఎప్పుడూ నేర్పించాలి. వారు తిరస్కరణను ఎదుర్కోవటానికి ఇష్టపడరు లేదా భయపడతారు. కష్టపడి, నిరంతర శ్రమతో విజయం సాధించవచ్చని పిల్లలకు కూడా నేర్పించాలి. ఓడిపోయినా, గెలిచినా గెలుపై వైపునకు సాగాలి అని పిల్లలకు పాఠాలు చెప్పాలి. అప్పుడే వారు బాగుపడతారు.



# ముఖంపై జిడ్డు పోవాలంటే ఇలా ట్రై చేయండి

**చలికాలంలో చాలా మందికి ముఖంపై జిడ్డు కనిపిస్తుంది. ముఖ్యంగా చలికాలంలో ఇంకాస్త ఎక్కువగా ఈ సమస్య వేధిస్తుంటుంది. ఇలాంటి వారు మాయిశ్చరైజర్ రాసుకోవాలన్నా ఇబ్బంది పడుతుంటారు. కానీ, కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తే ఈ సమస్యకు పరిష్కారం చూపొచ్చు.**



**ఉప్పు:**
ఇందుకోసం స్ప్రే సీసాలో నీళ్లు తీసుకుని అందులో చెంచా ఉప్పు వేసి.. ముఖం మీద ఆ నీటిని తరచూ స్ప్రే చేసుకుంటూ తుడుచుకోవాలని చెబుతున్నారు. ఇలా చేస్తే జిడ్డు సమస్య క్రమంగా తగ్గుముఖం పడుతుందని వివరిస్తున్నారు. అయితే, కళ్లపై మాత్రం ఆ స్ప్రే పడకుండా జాగ్రత్తపడాలని సూచిస్తున్నారు.



**పసుపు:**
ఇందులో పుష్కలంగా ఉండే యాంటీ ఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు జిడ్డుదనాన్ని దూరం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇందుకోసం ప్రతిరోజూ రాత్రిపూట చెంచా పసుపులో కొన్ని పాలు పోసి మెత్తటి ముద్దలా చేసుకోని ముఖం, మెడకు రాసుకోవాలని సూచిస్తున్నారు. ఇలా పెట్టుకుని పావుగంటయ్యాక కడిగేస్తే ముఖంపై పేరుకున్న జిడ్డు తొలగిపోతుందని వివరిస్తున్నారు.




**వంటసోడా:**
జిడ్డు సమస్యకు వంటసోడా కూడా బాగా ఉపయోగపడుతుందని నిపుణులు అంటున్నారు. ఇందుకోసం చెంచా నిమ్మరసంలో అరచెంచా బేకింగ్ సోడా కలిపి మొటిమలు ఉన్న చోట పూతలా వేయాలని చెబుతున్నారు. ఆ తర్వాత తడి చేత్తో మర్దన చేసి ఆ పూతను తొలగిస్తే మృతకణాలు పోతాయని వివరిస్తున్నారు. ఇంకా మొటిమలు కూడా తగ్గుముఖం పట్టడమే కాకుండా.. అలాగే జిడ్డు సమస్య కూడా తగ్గుతుందని వెల్లడిస్తున్నారు.





# కాఫీ తాగుతున్నారా.. అయితే మీ ఆయుష్షుకు గుడ్ న్యూస్

రోజుకో కప్పు కాఫీ తాగే అలవాటు ఉందా.. తాజా అధ్యయనం ప్రకారం, రోజూ కాఫీ తాగడం వల్ల ఎక్కువ కాలం ఆరోగ్యంగా జీవించే అవకాశం ఉంది.
కాఫీ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇటీవలి చేసిన ఓ అధ్యయనంలో ఎన్నో ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. కాఫీని ఎప్పుడు పడితే అప్పుడు తాగకూడు అని చెబుతున్నారు నిపుణులు. ఎప్పుడు తాగాలంటే.. యూరోపియన్ హార్ట్ జర్నల్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం విషయాలు విస్తుగొలిపేలా ఉన్నాయి. ఉదయం కాఫీ తాగేవారికి గుండె జబ్బుతో మరణించే ప్రమాదం తక్కువగా ఉంటుంది. రోజంతా కాఫీ తాగే వారికి మరణ ప్రమాదం తక్కువగా ఉంటుంది. ఉదయం పూట కాఫీ తాగేవారిలో మరణాలు 16 శాతం తక్కువగానూ, గుండె జబ్బులతో మరణించే అవకాశం 31 శాతం తక్కువగానూ ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయని అమెరికాలోని తులాన్ యూనివర్సిటీ పరిశోధకులు తెలిపారు.
ఉదయం కాఫీ తాగితే, మధ్యాహ్నం తాగే వారి కంటే మరణాల రేటు తక్కువగా ఉంటుందని అధ్యయనం కనుగొంది. కాఫీని సరైన సమయంలో తాగటం గురించి ఆరోగ్య ప్రభావాలను వెల్లడించడం ఇదే మొదటి సారి అని తెలుస్తుంది. మా అధ్యయన ఫలితాలు మీరు ఎంత కాఫీ తాగుతున్నారో లేదా ఎంత మోతాదులో తాగుతున్నారో, ఎప్పుడు త్రాగుతున్నారో కూడా తెలుసుకుని పరిశోధన చేసినట్లు డాక్టర్ లుగుయ్ చెప్పారు.
అధ్యయనంలో, పరిశోధకులు 1999 మరియు 2018 మధ్య సుమారు 40,725 మందిపై అధ్యయనం చేశారు. ఈ అధ్యయనంలో పాల్గొనేవారు కనీసం ఒక రోజులో ఏ ఆహారం, పానీయాలు తీసుకున్నారనే దానితో పాటు వారు కాఫీ తాగారా, అలా అయితే ఎంత, ఎప్పుడు అనే దాని గురించి డేటాను సేకరించారు. దీంట్లో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. ఉదయం లేచిన తర్వాత కాఫీని తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. మధ్యాహ్నం కాఫీ తాగిలి అనుకునే వారు అది విరమించుకోవడం చాలా ఉత్తమం.

